క్లుప్తంగా

ఘనంగా ఆర్‌ఎస్‌పీ జన్మదిన వేడుకలు

ఆమనగల్లు: బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ జన్మదిన వేడుకలు పట్టణంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆ పార్టీ శ్రేణులు కేక్ కట్‌చేసి సంబురాలు చేసుకున్నారు. కేకు, పండ్లు పంపిణీ చేశారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ పుట్టిన రోజులు వేడుకలు మండల కేంద్రంలో ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి, స్వీట్లు పంచిపెట్టారు.

చైర్‌పర్సన్ గీతకు సన్మానం



చైర్‌పర్సన్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా నియమితులైన యాట గీతను శనివారం యూత్ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్, ఎన్‌ఎస్‌యుఐ మండల అధ్యక్షుడు షాబుద్దీన్, నాయకులు పవన్, మహేందర్, దర్శన్ తదితరులు ఉన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



మెటీరియల్ అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఆమనగల్లు: గ్రీన్ మేకర్స్ అసోసియేషన్ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు పట్టణంలోని పలు పాఠశాలల విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఆర్టీసీ బస్టాండ్, పోస్టాఫీసు, కస్తూర్బాగాంధీ విద్యాలయం, ఎంఈఓ కార్యాలయం వద్ద బెంచీలు ఏర్పాటు చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్‌కుమార్, సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, సాయిబాబా, శ్రీకాంత్, ప్రధానోపాధ్యాయుడు విజయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

4న నాస్ మాదిరి పరీక్షలు

తలకొండపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 3,6,9వ తరగతుల విద్యార్థులకు డిసెంబర్4న నాస్ మాదిరి పరీక్ష నిర్వహించనున్నట్లు ఎంఈఓ చాంప్లా నాయక్ శనివారం తెలిపారు. చిన్నారుల సామర్థ్యాలను గుర్తించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేను కలిసిన చైర్‌పర్సన్



ఎంపీ మల్లు రవిని సన్మానిస్తున్న గీత

కడ్తాల్: ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌గా ఎన్నికయిన యాట గీత శనివారం నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. శాలువా కప్పి సన్మానించారు. డైరెక్టర్ నరేశ్‌నాయక్ ఎమ్మెల్యే కసిరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ కేశవరెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, నాయకులు హన్మానాయక్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, సంజీవ్ యాదవ్, లక్పతినాయక్, బీక్యానాయక్, రాజేందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

అయ్యప్ప భక్తులకు భిక్ష

కడ్తాల్: కులమతాలు వేరైనా సమాజంలో అందరూ ఒక్కటేనని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. శనివారం మైనార్టీ నాయకుడు మహ్మద్‌గౌస్ ఆధ్వర్యంలో అయ్యప్ప భక్తులకు భిక్ష (అన్నదానం) చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా చేపడుతున్న ఇలాంటి కార్యక్రమాలు మనలోని ఐక్యతను చాటుతాయన్నారు. ఈ సందర్భంగా దాత గౌస్‌ను అభినందించారు. సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం మండల గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా, నాయకులు రాజేందర్ యాదవ్, లాయక్‌అలీ, నరేందర్‌రెడ్డి, మహేశ్, మాలధారులు భీముడు, బిక్కునాయక్, రాంరెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, లక్ష్మయ్య, విజయ్, రాజు, శ్రీశైలం, శ్రీకాంత్, మహేశ్ పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి

తుర్కయంజాల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. శనివారం పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 68వ స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–19 బాలికల ఇంటర్ డిస్ట్రిక్ స్టేట్ లెవల్ కబడ్డీ పోటీలను టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ సత్తయ్యతో కలిసి ప్రారంభించారు.



యాచారం: కంప్యూటరీకరణ చేస్తున్న ఆపరేటర్లు



మంచాల: గురునానక్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీఓ బాలశంకర్

డేటా ఎంట్రీ షురూ..

- సర్వే వివరాలను కంప్యూటరీకరణ చేస్తున్న ఆపరేటర్లు
- పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓలు
- పారదర్శకంగా ప్రక్రియ కొనసాగించాలంటూ ఆదేశం

యాచారం/మంచాల: ఓ పక్క సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే శరవేగంగా కొనసాగుతుండగా.. మరో పక్క ఎన్యుమరేటర్లు ప్రజల నుంచి సేకరించిన వివరాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ మొదలుపెట్టారు. శనివారం యాచారం మండల పరిషత్ కార్యాలయంలో 30 మంది ఆపరేటర్లు 408 కుటుంబాలకు సంబంధించిన వివరాలను నమోదు చేయగా.. ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి పరిశీలించారు. మంచాల మండలం గురునానక్ ఇంజినీరింగ్ కళాశాలలో డేటా ఎంట్రీ ప్రక్రియను ఎంపీడీఓ బాలశంకర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా యాచారం ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండల పరిధి 15,808 కుటుంబాలకు గాను 14,894 కుటుంబాల సర్వే పూర్తి చేశామని, మిగతా 914 నివాసాల సర్వే చేయాల్సి ఉందని తెలపగా.. 82 శాతం కులగణన పూర్తయిందని, మిగతాది గడువులోగా పూర్తయ్యేలా చూస్తామని మంచాల ఎంపీడీఓ తెలిపారు. సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచేందుకు ఆపరేటర్లను నియమించామని, తప్పులు లేకుండా నమోదు కొనసాగుతుందని పేర్కొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రత్యేక డ్రైవ్

ఉప తహసీల్దార్ సంతోష్



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న డీటీ సంతోష్

తలకొండపల్లి: గ్రామాలను స్వచ్ఛతగా తీర్చిదిద్దేందుకే ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నామని ఉప తహసీల్దార్ సంతోష్ అన్నారు. శనివారం మండల పరిధి గట్టుఇప్పలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, ఆరోగ్య కేంద్రాల్లో డిసెంబర్ 4 వరకు పారిశుద్ధ్య పనులు చేపడతామని పేర్కొన్నారు. సర్కారు బడుల్లో మూత్రశాలలు, తరగతి గదులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఫినాయిల్, బ్లీచింగ్ పౌడర్‌తో నిత్యం శుభ్రం చేయాలని ఆదేశించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి గ్రామ పంచాయతీ సిబ్బందికి అప్పగించాలని చెప్పారు.

అపరిచితులతో అప్రమత్తం

- యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దు
- గ్రీన్ ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు



వృద్ధులతో మాట్లాడుతున్న సీఐ కృష్ణంరాజు, సిబ్బంది

యాచారం: అపరిచితులతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు సూచించారు. పీఎస్ పరిధి నక్కర్తమేడిపల్లి గ్రామంలో శనివారం ఆయన స్థానికులతో మాట్లాడారు. గ్రామంలో కొత్తగా ఎవరైనా కనిపిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. సైబర్ నేరాలగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా తమకు వెంటనే సమాచారం ఇవ్వాలని తెలిపారు. వృద్ధులు విలువైన ఆభరణాలు ధరించరాదని, రాత్రి వేళలో ఎవరైనా తలుపు తీయమంటే వెంటనే తీయరాదని వెల్లడించారు. యువత మద్యం, గంజాయి తదితర మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ తేజంరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్ల నియామకం

డైరెక్టర్లను సన్మానించిన నేతలు

తలకొండపల్లి: ఆమనగల్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా మండల కేంద్రానికి చెందిన ఎండీ అజీం, అంజయ్య గుప్తా, వెల్జాల్‌కు చెందిన చర్ల వెంకట్ రెడ్డి, లింగారావుపల్లికి చెందిన పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, శ్యాంసుందర్ రెడ్డిలను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఉత్వర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా నూతన డైరెక్టర్లు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశామని, దాని ఫలితమే తమను ఈ పదవులు వరించాయని పేర్కొన్నారు. మాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్ రెడ్డి, నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన డైరెక్టర్లను స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు శనివారం ఘనంగా సన్మానించారు.



అజీం | అంజయ్య గుప్తా | కేశవరెడ్డి | శ్యాంసుందర్‌రెడ్డి | చర్ల వెంకట్ రెడ్డి

సాంకేతిక రంగంలో రాణించాలి

ప్రిన్స్‌పాల్ డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు సాంకేతిక రంగంలో రాణించాలని సీవీఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ కె.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం కళాశాల ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం, శేరిగూడ ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బాలబాలికలకు ఐదు వారాల పాటు కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్స్‌పాల్ మాట్లాడుతూ.. కళాశాల ఆధ్వర్యంలో పేద విద్యార్థుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం నేర్పించడానికి పాటుపడుతున్నామని, విద్యార్థులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కె.రామశాస్త్రి, సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రత్నందొడ్డా, అధ్యాపకులు, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యతలో మేటి.. భారతి సిమెంట్



తాపీ మేస్త్రీలతో సంస్థ టెక్నికల్ ఇంజినీర్ బద్రీ

సీనియర్ టెక్నికల్ ఇంజినీర్ బద్రీ

అబ్దుల్లాపూర్‌మెట్: సిమెంట్ రంగంలో తిరుగులేని సంస్థగా భారతి సిమెంట్ ఎదిగిందని సంస్థ సీనియర్ టెక్నికల్ ఇంజినీర్ బద్రీ తెలిపారు. అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5స్టార్ గ్రేడ్‌ను రాష్ట్రంలో విడుదల చేసిందని పేర్కొన్నారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధి కుంట్లూర్‌లోని యాదాద్రి సిమెంట్, స్టీల్ డీలర్ దుకాణంలో శనివారం రాత్రి తాపీ మేస్త్రీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతంగా పూర్తవుతుందన్నారు. ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపికన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచితంగా సాంకేతిక సహాయం అందచేస్తామని, స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన సంస్థ ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారని వెల్లడించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తుర్కయంజాల్: 11కేవీ నాదర్‌గుల్ టీఎస్‌ఐఐసీ ఇండస్ట్రీయల్ ఫీడర్, గ్రీన్ ఫీల్డ్ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఆదివారం పలు చోట్ల ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏఈ రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం, గైరాన్‌కోట, ఎంఎన్‌ఆర్ హోమ్స్, ద్వారకాపురి, మర్రిగూడ, రాగన్నగూడ, కుర్మల్ గూడ, ఎస్‌పిఆర్ హోమ్స్, ఇంద్రానగర్, జన్నారం, అగ్రికల్చర్, ఆదిబట్ల మెయిన్ రోడ్, ఆయుధాల గడ్డలో సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఆదిబట్లలో..

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏఈ జయన్న తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధి ఆదిబట్ల టౌన్, ఆదిబట్లసెజ్, మమ్మురాజుగూడెం, మరియపురం, పోలిస్‌స్టేషన్, శ్రీశ్రీ ఏరోసిటీ, టీసీఎస్ పరిసర ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలగనుందని పేర్కొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహాపడి పూజ



పడిపూజ చేస్తున్న అయ్యప్ప భక్తులు

తుర్కయంజాల్: అయ్యప్ప స్వామి మహాపడిపూజ గురుస్వామి సత్యప్రియ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరిగింది. సిలివేరు యాదగిరి, మధులిక నిర్వహించిన పూజా కార్యక్రమంలో అయ్యప్ప మాలధారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. 18 పడి మెట్లకు పూజలు చేసి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తుల ఆలపించిన భక్తి గీతాలతో ప్రాంతం మారుమోగింది. కార్యక్రమంలో గంగాధర్, శ్రీనివాస్, మోహన్ చారి పాల్గొన్నారు.

దేశంలో బీజేపీ హవా..

తలకొండపల్లి: దేశంలో బీజేపీ హవా నడుస్తోందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తిర్మణి రవిగౌడ్ అన్నారు. మహారాష్ట్రలో పార్టీ కూటమి భారీ విజయం సాధించడం పట్ల ఆయన హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా రవిగౌడ్ మాట్లాడుతూ.. ఉప ఎన్నికల్లో ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లో కమలం వికసిస్తోందని పేర్కొన్నారు. మహారాష్ట్రలో ఎన్‌డీఏ కూటమి ఆధ్వర్యంలో పార్టీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుందన్నారు. ఇందుకు ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమాభివృద్ధి పథకాలే.. ప్రజలు ఏకపక్షం తీర్పు ఇచ్చేలా చేశాయని వెల్లడించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ తుడిచిపెట్టుకు పోయిందన్నారు.

సమష్టిగా హక్కులు సాధించుకోవాలి

ఇబ్రహీంపట్నం: దళితులు ఐకమత్యంతో రాజ్యాంగం కల్పించిన హక్కులను సాధించుకోవాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కావలి నర్సింహ సూచించారు. మండల కేంద్రంలో శనివారం దళిత హక్కుల పోరాట సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళితులు తరతరాలుగా అణచివేత, అంటరానితనం, వివక్ష, దోపిడీకి గురవుతున్నారని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను వినియోగించుకుని, అక్షరాస్యత, ఆర్థిక, రాజకీయంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. లేని పక్షంలో దోపిడీకి గురవుతూనే ఉంటారని తెలిపారు. సమావేశంలో నాయకులు మల్లేశ్, లక్ష్మయ్య, నర్సింహ, శ్రీశైలం, నారాయణ, ప్రభాకర్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- పెండింగ్ పనులు పూర్తిచేయండి
- ఆస్పత్రిని వినియోగంలోకి తేవాలి
- మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్



ఆస్పత్రి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న జైపాల్ యాదవ్ తదితరులు

ఆమనగల్లు: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీని అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఆరోపించారు. పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న 50 పడకల ప్రభుత్వాసుపత్రి భవన నిర్మాణ పనులను శనివారం బీఆర్‌ఎస్ స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో ఆస్పత్రి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని తెలిపారు. పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. అదే విధంగా పట్టణంలో అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల వివాదాన్ని పరిష్కరించి, నిర్మాణ పనులను పూర్తి చేయించాలని పేర్కొన్నారు. డిగ్రీ కళాశాలకు నూతన భవనం నిర్మించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

త్వరలో లగచర్లకు..

ఎన్నికల ముందు రైతుభరోసా ఇస్తామని చెప్పి.. కాంగ్రెస్ పార్టీ మాట తప్పిందని, రుణమాఫీ అసంపూర్తిగానే అయిందని, రైతుబీమా ఊసే లేదని జైపాల్ యాదవ్ విమర్శించారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం లగచర్లలో నిరుపేదల భూములను గుంజుకోవాలని చూడటమే కాకుండా.. ఎదురించిన వారిపై ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతూ జైలులో పెడుతుందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీరుకు నిరసనగా కల్వకుర్తి నుంచి త్వరలో పెద్ద ఎత్తున లగచర్లకు తరలి వెళ్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు అనురాధ, బీఆర్‌ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కుమార్, నాయకులు సయ్యద్ ఖలీల్, రఘు, రాములు, బాలస్వామి, రమేశ్, ప్రసాద్, యాదయ్య, ఖాదర్, గణేశ్, దేవేందర్, శ్రీరామ్, గణేశ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతా



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న చైర్మన్ నిరంజన్‌రెడ్డి తదితరులు

చైర్మన్ నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీని హైటెక్ నగరంగా తీర్చిదిద్దుతామని చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. పుర పరిధి కొంగరకలాన్ 5వ వార్డులో రూ.10 లక్షలతో సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. 15 వార్డుల్లో ఇప్పటి వరకు ఎంతో అభివృద్ధి చేశామని తెలిపారు. మున్సిపాలిటీ వేగంగా అభివృద్ధి చెందుతుందని, దీంతో అనేక పరిశ్రమలు కొలువుదీరుతున్నాయన్నారు. రియల్ ఎస్టేట్ జోరుగా సాగుతుందని చెప్పారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి చేస్తున్నాని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ యాదగిరి, కౌన్సిలర్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, స్థానిక నాయకులు గుబ్బరాజు, శిగ మహేందర్, శ్రీనాథ్, మహేందర్, జంగమ్మ, నాగమ్మ, శ్రీకాంత్, అర్జున్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు
- తహసీల్దార్ అయ్యప్ప



విద్యార్థులతో భోజనం చేస్తున్న తహసీల్దార్

యాచారం: విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని, ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అయ్యప్ప పాఠశాల సిబ్బందిని హెచ్చరించారు. శనివారం ఆయన మండల పరిధి గునుగల్ ఆదర్శ పాఠశాలను సందర్శించారు. వంట గదులు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అన్నంలో పురుగులు ఉంటున్నాయా? స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నారా అని తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఇదిలా ఉండగా.. ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి మండల కేంద్రంలో ఉన్న బీసీ సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించారు. విద్యార్థుల సౌకర్యాలపై ఆరా తీశారు. భోజనాన్ని పరిశీలించి నాణ్యమైన భోజనం అందించాలని అక్కడి సిబ్బందికి సూచించారు.

ప్రియాంక గాంధీ విజయోత్సవం



బాణసంచా కాలుస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఆమనగల్లు: ప్రియాంక గాంధీ ఎంపీగా విజయం సాధించడంతో పట్టణంలో కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. బాణసంచా కాల్చారు. ఉప ఎన్నికలో భాగంగా రాహుల్ గాంధీ రాజీనామాతో ఖాళీ ఏర్పడిన కేరళ రాష్ట్రం వాయనాడ్ పార్లమెంటు నియోజకవర్గం బరిలో పోటీచేసిన ప్రియాంక.. శనివారం వెలువడిన ఫలితాల్లో భారీ మెజార్టీతో గెలిచారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దేశంలో కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలు సానుకూలంగా ఉన్నారని చెప్పడానికి ఇదే నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, నాయకులు కృష్ణనాయక్, ఫరీద్, ఖాదర్, శ్రీకాంత్, రాజు, మల్లయ్య, మహేశ్, రామకృష్ణ, షర్ఫుద్దీన్, నాజర్, ఖాదర్, సురేశ్‌నాయక్, మైసయ్య, యాదయ్య, బల్‌రాం పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

మంచాల: కేంద్రం ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రావుల జంగయ్య అన్నారు. శనివారం మండలంలోని జాపాల గ్రామంలో 26న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా జిల్లా కేంద్రాల్లో చేపట్టనున్న నిరసన కార్యక్రమాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ సర్కార్ పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తూ.. పేద ప్రజలకు అన్యాయం చేస్తుందని ఆరోపించారు. రైతు, కూలీల హక్కులను హరించే నల్ల చట్టాలను తెస్తుందని విమర్శించారు. ప్రభుత్వాలు అవలంబించే ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని, అందుకు సంయుక్త కిసాన్ మోర్చా, జాయింట్ ప్లాట్‌ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ పిలుపు మేరకు చేపట్టనున్న నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. రైతు సంఘం మండల అధ్యక్షుడు లట్టుపల్లి చంద్ర శేఖర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జగన్, మండల కార్యదర్శి కె.జంగయ్య, సీపీఎం కార్యదర్శులు కె.పాపిరెడ్డి, భాస్కర్‌గౌడ్ ఉన్నారు.

గురునానక్‌లో హ్యాకథాన్

ఇబ్రహీంపట్నం: గురునానక్ విశ్వవిద్యాలయంలో శనివారం జాతీయ స్థాయి హ్యాకథాన్–2024 ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీ పాల్‌టెక్ రాష్ట్ర డైరెక్టర్ అభినవ్ మాట్లాడుతూ.. హ్యాకథాన్‌తో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బిగ్ డేటా, సైబర్ సెక్యూరిటీ తదితర వాటిపై అవగాహన పెంచుకోవచ్చని తెలిపారు. విద్యాసంస్థల వైస్ చైర్మన్, యూనివర్సిటీ వైస్ చాన్సలర్ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ మాట్లాడుతూ.. విద్యార్థులు తమ ప్రతిభను మరింత బలోపేతం చేసుకునేందుకు హ్యాకథాన్ దోహదపడుతుందని పేర్కొన్నారు. గురునానక్ విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్.శ్రీనాథ్‌రెడ్డి, డాక్టర్ సంజీవ శ్రీవాత్సవ, జాయింట్ డైరెక్టర్ పి.పార్థసారధి రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.